సాక్షి ఆదిలాబాద్
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న షబ్బీర్ అలీ, పక్కన కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, అధికారులు

న్యూస్‌రీల్

జైలు సూపరింటెండెంట్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



అశోక్‌కుమార్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న డీజీపీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా జైలు సూపరింటెండెంట్ పీ అశోక్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో అశోక్‌కుమార్‌కు జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యామిశ్రా ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

జిల్లాలో ముగిసిన రాజీవ్ సద్భావన యాత్ర



జెండా ఊపి వీడ్కోలు పలుకుతున్న కంది

కైలాస్‌నగర్: రాజీవ్ సద్భావనయాత్ర జిల్లాలో ముగిసింది. ఈ నెల 9న పెరంబుదూర్‌లో మొదలైన యాత్ర ఈనెల 20న న్యూఢిల్లీలోని రాజీవ్‌గాంధీ సమాధి వీర్ భూమికి చేరుకుంటుంది. యాత్ర బుధవారం ఆదిలాబాద్ పట్టణానికి చేరింది. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో యాత్రీకులు రాత్రి బస చేశారు. గురువారం ఉదయం క్యాంపు కార్యాలయ ఆవరణలో శ్రీనివాసరెడ్డి జెండా ఊపి యాత్రకు వీడ్కోలు పలికారు. 32 ఏళ్లుగా యాత్ర కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జీ నగేశ్, నాయకులు బీడీ చారి, శంకర్, కిషన్ పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం'



సమావేశంలో మాట్లాడుతున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆశాభావం వ్యక్తంజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 40శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. మోసపూరిత హామీలతో మరోసారి ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. నాయకులు రోకండ్ల రమేశ్, గంద్రత్ రమేశ్, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, సాజిదొద్దీన్, అజయ్, మమత, సలీం పాల్గొన్నారు.

రెన్యూవల్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యూవల్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేణుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం డీఐఈవో రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు డీఐఈవోను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012 నుంచి జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమ సర్వీస్‌ను రెన్యూవల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు 12నెలల వేతనం రూ.42వేలతో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా తమ స్థానాన్ని కోల్పోయిన లెక్చరర్లకు వారి మల్టీజోన్‌లో సర్దుబాటు చేయాలని, సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి సర్వీస్‌ను ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగించేలా చూడాలని కోరారు. స్పందించిన డీఐఈవో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



పిరమిడ్‌ను ప్రదర్శిస్తున్న అర్బన్ కేజీబీవీ విద్యార్థినులు

జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం

- ఆదిలాబాద్‌పై సీఎం ప్రత్యేక దృష్టి
- 'జన్‌మన్'తో గిరిజనులకు సాయం
- ఇందిరా మహిళాశక్తి కింద ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఆర్థిక బలోపేతానికి కృషి
- వచ్చే ఏడాదికి కొరటా–చనాకా నీరు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 78వ స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇందిరా మహిళాశక్తి కింద..

గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఇందిరా మహిళాశక్తి కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను రాబోయే ఐదేళ్లలో ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3,364 ఎంటర్‌ప్రైజెస్‌లు, 19 సేవాకేంద్రాలు, 108 యూనిఫాం కుట్టు కేంద్రాలు, నాలుగు మహిళాశక్తి క్యాంటీన్లు, 544 పాడి గేదెల పెంపకం యూనిట్లు, 2004 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు, 13 మదర్ పౌల్ట్రీ యూనిట్లు, 63 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఉట్నూర్‌లో ఒక సంచార చేపల విక్రయ కేంద్రం, జైనథ్‌లో ఒక పాల పదార్థాల విక్రయ కేంద్రం ప్రారంభానికి సిద్ధం చేసినట్లు చెప్పారు. 1,961 స్వయం సహాయక సంఘాలను గుర్తించి 95,195 మంది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 93,629 కుట్టి అందించినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు 4,171 యూనిఫాంలు కుట్టి అందించినట్లు తెలిపారు.

వివిధ వర్గాల అభ్యున్నతికి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొరాట–చనాక ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు భూసేకరణ కోసం రూ.134 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరానికి 27,800 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కింద బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి రూ.11.65 కోట్లతో ఎంఆర్ఐ యంత్రాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. దీన్ని అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో విద్యుత్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం రూ.25.5 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సంక్షేమ శాఖల ద్వారా వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు వివరించారు.

పోలీస్‌శాఖ ద్వారా..

పోలీస్‌శాఖ ద్వారా జిల్లాలో ఈ సంవత్సరం గంజాయిని అరికట్టడంలో భాగంగా 35 కేసుల్లో 74 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 111 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా 20 మంది పోలీసు సిబ్బందితో డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీడీఆర్ఎఫ్) బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సైబర్‌క్రైమ్ ద్వారా మోసపోయిన 45 మంది బాధితులకు దాదాపు రూ.4లక్షలు కోర్టు ద్వారా ఇప్పించినట్లు తెలిపారు.

కార్యక్రమం కొనసాగిందిలా..

ఉదయం 10 గంటలకు రాష్ట్ర సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ పరేడ్ మైదానానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్, ఎస్పీ స్వాగతం పలికారు. జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. కాగా, ఈ వేడుకల్లో జయ జయహే తెలంగాణ గీతం వినిపించారు. అనంతరం శకటాల ప్రదర్శన కొనసాగింది. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ నేతలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గణేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదిలాబాద్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనుకుంట మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు, అర్బన్ కేజీబీవీ విద్యార్థినులు, ఇచ్చోడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, బండల నాగపూర్ మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు, ఆదిలాబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఆకట్టుకున్న స్టాళ్లు, శకటాలు

వేడుకల్లో ఎనిమిది స్టాళ్లు ఏర్పాటు చేశారు. తొలిసారి పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఆయుధాలు, డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఎస్పీ గౌస్ ఆలం ఆయుధాలు, వినియోగానికి సంబంధించిన వివరాలు తెలిపారు. సమాచార పౌరసంబంధాలశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, శిశు మహిళా వికలాంగుల సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య, విద్యాశాఖ స్టాళ్లు ఏర్పాటు చేశారు. పౌరసరఫరాల శాఖ మహాలక్ష్మి పథకం, ఆర్టీసీ తరఫున పల్లె వెలుగు బస్సు, వైద్యారోగ్యశాఖ పథకాలతో ఏర్పాటు చేసిన శకటాలను ప్రదర్శించారు.

జన్‌మన్ పైలెట్ ప్రాజెక్ట్‌తో..

కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో ప్రధాన మంత్రి జన్‌మన్ పైలెట్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు వివరించారు. గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం, మెరుగైన వసతులు కల్పించేందుకు ఈ పథకం దోహద పడుతుందని వివరించారు. కలెక్టర్ సహాయ సహకారాలతో కొనసాగిస్తున్నట్లు వివరించారు. గిరిజనులకు ఆరోగ్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, సబ్సిడీ బ్యాంక్ రుణాల కల్పనకు చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా 12 మల్టీపర్పస్ కమ్యూనిటీ కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కో భవనాన్ని రూ.60 లక్షలతో చేపట్టగా నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు..

కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలైన మహాలక్ష్మి గృహజ్యోతి, యువ వికాసం, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల అమలుకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం ద్వారా ఇప్పటివరకు 83,22,681 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ప్రజాపాలన సేవా కేంద్రాలను ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 24,635 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గృహజ్యోతిలో భాగంగా అర్హులైన 95,037 మంది వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పొందే అర్హత 96,115 మందికి ఉండగా, ఇప్పటివరకు 1,73,256 సిలిండర్లు సరఫరా చేసినట్లు వివరించారు. ఇందుకు రూ.4.89 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రుణమాఫీ పథకాన్ని అమలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. చేయూత పథకం కింద మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న షబ్బీర్ అలీ



ప్రదర్శనలు తిలకిస్తున్న షబ్బీర్ అలీ, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎస్పీ



పోలీస్ జాగిలంతో గౌరవవందనం స్వీకరిస్తున్న షబ్బీర్ అలీ



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రోగులకు నాణ్యమైన సేవలందించాలి

- కలెక్టర్ రాజర్షిషా
- రిమ్స్ ఆకస్మిక తనిఖీ



రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం రిమ్స్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా మొదటి, రెండు, మూడో అంతస్తుల్లోగల వార్డులను పరిశీలించారు. బ్లడ్‌బ్యాంక్, పిల్లల వార్డు, ఫిమేల్ మెడికల్ వార్డు, ఆర్వో ప్లాంట్, ఐసోలేషన్, ఐసీయూ వార్డులను సందర్శించారు. డెంగీ కేసుల గురించి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ద్వారా తెలుసుకున్నారు. వార్డుల్లోని సమస్యల గురించి రోగులను ఆరా తీశారు. ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో డెంగీ నిర్ధారణ కిట్లు, ఆర్డీఎస్ నిల్వలు, రోజుకు రోగులకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ ఆస్పత్రి, ఐసీయూ వార్డు, ఫార్మసీ, హాజరు పట్టికలు పరిశీలించారు. రోగుల భోజనానికి సంబంధించిన మెనూ బోర్డు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్స్ వీరే..

కైలాస్‌నగర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలను ఆహ్వానించింది. ఇందులో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి నూతన ప్రాజెక్టులు ఆవిష్కరించారు. కదం ప్రణీత్, అడే దివ్యారాణి, పవార్ శాలిని, ఆత్రం విలాస్, సాయితేజస్వి, సోనియా తమ ప్రాజెక్టులతో ఆకట్టుకుని పురస్కారాలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు ప్రణీత్, దివ్యారాణి, శాలిని, విలాస్, సాయితేజస్వి, సోనియా

రైతులకు రుణ విముక్తి

- మూడోవిడతలో 19,493 మందికి..
- రైతుల ఖాతాల్లో రూ.286.26కోట్లు
- మూడు విడతల్లో 55,961 మందికి..
- మాఫీ మొత్తం రూ.608.88 కోట్లు
- ఆనందం వ్యక్తంజేస్తున్న అన్నదాతలు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా రైతులకు రుణ విముక్తి లభించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. మొదటి విడతలో రూ.లక్ష వరకు, రెండో విడతలో రూ.లక్షన్నర వరకు రుణాలున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన విషయం తెలిసిందే. తుది విడత రుణమాఫీ డబ్బులను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని వైరాలో విడుదల చేశారు. దీంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జిల్లాలో విడతలవారీగా ఇలా..

ప్రభుత్వం మొదటి విడతలో జిల్లాలో 18,821 మంది రైతులకు రూ.120.79 కోట్లు జమ చేసింది. రెండో విడతలో 17,647 మందికి రూ.201.83 కోట్లు విడుదల చేసింది. గురువారం మూడో విడతలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 19,493 మంది రైతులకు రూ.286.26 కోట్లు విడుదల చేశారు. మూడు విడతల్లో కలిపి జిల్లాలో 55,961 మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం చేకూరింది. రూ.608.88 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది.

వర్తించనివారికెప్పుడో!

జిల్లాలో రైతులకు సంబంధించి 1.17లక్షల బ్యాంక్ ఖాతాలున్నాయి. ఆయా బ్యాంకుల నుంచి 90వేల మంది రుణాలు పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రేషన్‌కార్డున్నవారికే రుణమాఫీ వర్తించింది. కార్డు లేనివారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లించే రైతులకు వర్తించనట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం రేషన్‌కార్డు లేనివారికీ రుణమాఫీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 90వేల మంది ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోగా, 55,961 మందికే మాఫీ వర్తించింది. రుణమాఫీ వర్తించనివారి నుంచి ఆయా మండలాల ఏవోలు, ఏఈవోలు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రుణమాఫీ రాని రైతులు ఆందోళనతో బ్యాంకులు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కాగా, జిల్లాలో మూడు విడతల్లో కలిపి సుమారు 10వేల మంది రైతులకు రుణమాఫీ డబ్బులు జమ కానట్లు తెలుస్తోంది.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి డిమాండ్ చేశారు. గురువారం రిమ్స్ ఓపీ విభాగం ఎదుట విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మెడికల్ కళాశాలలో వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారుణ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

కైలాస్‌నగర్: తనకు ఆదిలాబాద్‌తో సత్సంబంధాలున్నాయని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన గురువారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు తన క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు గిమ్మ సంతోష్, జాంటీ, దుర్గం శేఖర్, డేరా కృష్ణారెడ్డి, షకీల్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

క్లుప్తంగా

శాటిలైట్ సెంటర్ హెచ్‌డబ్ల్యూవో సస్పెన్షన్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడ 2లోని గిరిజన శాటిలైట్ సెంటర్ హెచ్‌డబ్ల్యూవో జైవంత్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం కలెక్టర్ శాటిలైట్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. నిత్యావసర సరుకులు భద్ర పరిచే గదితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌డబ్ల్యూవోపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆస్ట్రేలియాలో మాజీ ఎమ్మెల్యేకు సత్కారం



విక్టోరియా మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రేఖా నాయక్

ఖానాపూర్: ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ సత్కారం పొందారు. అక్కడి ఉద్యోగాలు, పరిశ్రమలు, మహిళశాఖ, ట్రీటీ అండ్ ఫస్ట్ పీపుల్స్ మంత్రి ''నాటలి హచిన్స్'' చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విక్టోరియాలో నిర్వహించిన భారత 78వ స్వాతంత్ర్య వేడుకల్లో రేఖానాయక్ పాల్గొన్నారు. తెలంగాణ ఉత్తమ ప్రజాప్రతినిధిగా గుర్తించి సత్కరించారు.

కళాకారునికి ప్రశంస



సన్మానిస్తున్న సిరిసిల్ల రాజయ్య

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ లఘుచిత్ర కళాకారుడు, ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వేణుగోపాలకృష్ణను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గురువారం సన్మానించారు. స్వాతంత్ర్య వేడుకల ముఖ్య అతిథిగా విచ్చేసిన సిరిసిల్ల రాజయ్య డాక్టర్ వేణుగోపాలకృష్ణ సామాజిక, కళారంగాల్లో చేస్తున్న సేవలను ప్రశంసించారు. శాలువా, జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ గతంలో పలుమార్లు ఉత్తమ వైద్యాధికారిగా పురస్కారాలు అందుకున్నారు. ఆయన నటించిన ప్రేమతో నాన్న లఘు చిత్రానికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైద్యులు దామెర రాములు, నారాయణ గౌతమ్, ఉదయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు



గాయపడ్డ ఆర్టీసీ డ్రైవర్ జలెందర్

కుంటాల: మండలంలోని కల్లూర్–కుంటాల రహదారిపై అందాకూర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ అరిగెల జలెందర్‌కు గాయాలయ్యాయి. విధులు ముగించుకున్న జలెందర్ ద్విచక్ర వాహనంపై కుంటాలకు వస్తుండగా పెంచికల్‌పాడ్ నుంచి బైక్‌పై వస్తున్న గంగాధర్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఎస్సై రజినీకాంత్ పోలీస్ వాహనంలో కల్లూరు వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస



షబ్బీర్ అలీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్.నర్సయ్య

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, విశిష్ట సేవలందించిన పలువురు ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం గుర్తింపునిచ్చింది. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశంసాపత్రాలు అందించారు.



టీ.కిరణ్‌కుమార్, డీసీవో | బీ.మోహన్, జిల్లా సహకార అధికారి | రాజు, పరిశ్రమలశాఖ జీఎం | టీ.శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ



కే.సురేశ్, మిషన్ భగీరథ ఎస్ఈ | ఆర్.శివరాం, పంచాయతీరాజ్ ఈఈ | జీ.సాయన్న, డీఆర్డీవో | వెంకటేశ్వర్లు, డీవైఎస్వో | ఎస్.ఆశన్న, డీటీసీ, ఆదిలాబాద్



పీ.శ్రీనివాస్, డీఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ | హకీం, ఎస్సై డీసీఆర్బీ, ఆదిలాబాద్ | జే.కవిత, ఏఎస్సై, సీసీసీ, ఆదిలాబాద్ | భీమేశ్ సీఐ, ఇచ్చోడ | రమేశ్, సీఐ, బోథ్ | రాధిక, ఎస్సై, బేల | జే శివశంకర్, పీసీ, స్పెషల్ బ్రాంచ్ | రమేశ్, టూటౌన్ కానిస్టేబుల్ | ఎస్.ఆశన్న, డీటీసీ కానిస్టేబుల్ | నరేశ్, కానిస్టేబుల్, సీసీఎస్



జీ శ్రావ్య, జూ.అసిస్టెంట్, డీపీవో కార్యాలయం | దిలీప్‌కుమార్, ఎస్సై, ఇంటెలిజెన్స్ | అమృత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, ఇంటెలిజెన్స్ | శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ ఇంటెలిజెన్స్ | వేణుగోపాల్, వార్డర్, జిల్లా జైలు | అజయ్‌కుమార్, ప్యానెల్ అడ్వకేట్ | కవితారాణి, నాయబ్ తహసీల్దార్, కలెక్టరేట్ | డీ.హరిత, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | అశ్విని, జూ.అసిస్టెంట్, కలెక్టరేట్ | స్వాగత్, ధరణి జిల్లా కోఆర్డినేటర్



ఎస్.శ్రీనివాస్, తహసీల్దార్, ఆదిలాబాద్ అర్బన్ | రాజేశ్వరి, నాయబ్ తహసీల్దార్, జైనథ్ | అమ్రపాలి, సీనియర్ అసిస్టెంట్, ఆదిలాబాద్ అర్బన్ | సుభాష్‌చందర్, తహసీల్దార్, బోథ్ | ప్రవీణ్, జూ.అసిస్టెంట్, నేరడిగొండ | పుండలీక్, ఎఫ్ఆర్వో, ఇచ్చోడ | బీ.ప్రశాంత్, ఎఫ్‌బీవో, ఆదిలాబాద్ | ఫారూఖ్‌అలీ, డీపీవో, ఆదిలాబాద్ | కే.నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్ | నవనీత, పంచాయతీ సెక్రటరీ, జాతర్ల, బజార్‌హత్నూర్



సునీత, పంచాయతీ సెక్రటరీ, నిపాని, భీంపూర్ | జీ.పవన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్, ఎంపీపీ ఇంద్రవెల్లి | కే.శివకుమార్, ఏవో టెక్నికల్, ఆదిలాబాద్ | ఏ.రవీందర్, ఏవో, తాంసి | ఏ.సౌజన్య, ఏఈవో, సుంకిడి క్లస్టర్ | బీ.పుష్పమాల, యూడీఆర్ఐ, సివిల్ సప్లయ్ | శ్రీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ | పీ.రాధిక, సూపరింటెండెంట్, పంచాయతీరాజ్, ఆదిలాబాద్ | గంగాధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డీఆర్డీవో | షేక్ మురాద్, ఆఫీస్ సబార్డినేట్, డీఆర్డీవో



కే.నర్సింహులు, విద్యాశాఖ ఏడీ | టీ.విజయ్‌కుమార్, ఏఎంవీఐ, ఆదిలాబాద్ | చౌహాన్ శశికళ, సీనియర్ అసిస్టెంట్ | ప్రమోద్, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్ | ఆర్.భీంరావు, ఈఈ, ట్రైబల్ వెల్ఫేర్ | అశోక్, ఈఈ, టీజీఈడబ్ల్యూఐడీసీ | ఏ ఫణీందర్‌రావు, డివిజనల్ పంచాయతీ అధికారి | టీ వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్ | ఎల్.జీవాకర్‌రెడ్డి, ఆర్డీవో, ఉట్నూర్ | ఎండీ అతీకుర్ రహమాన్, ఏవో, సెకండ్ బెటాలియన్



డీ సాయిప్రసాద్, ఎంపీవో, గాదిగూడ | సాయికిరణ్, జిల్లా ఇన్నోవేషన్ కో ఆర్డినేటర్ | ఎం.శారద, సీడీపీవో, నార్నూర్ | ఏ హరీశ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ | ఎంఏ కలీం, సీనియర్ ఆడిటర్ | జీ దేవేందర్, ఏఈ, హత్తిఘాట్ | కలీంఖాన్, డీఈవో, విద్యాశాఖ | నవనీత్‌కుమార్, ఆర్ఐ, సెకండ్ బెటాలియన్ | ఎల్.బద్దు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఉట్నూర్ | ఆర్ వీరేందర్‌సింగ్, జూనియర్ అసిస్టెంట్, జిల్లా పరిషత్

చాక్‌పీస్‌పై జాతీయ జెండా



రాజు తయారు చేసిన జెండా

తాంసి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కళాకారుడు గట్టు రాజు దేశంపై ఉన్న అభిమానంతో చాక్‌పీస్‌పై జాతీయ జెండాను రూపొందించాడు. రాజు తన కళా నైపుణ్యంతో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను సైతం గీస్తూ పలువురిని ఆకర్షింజేస్తూ ఉంటాడు. సుద్దముక్కపై జాతీయ జెండాను రూపొందించిన రాజును పలువురు అభినందించారు.

రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం

- బెంగళూరుకు చెందిన వృద్ధుడు హఠాన్మరణం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరిన రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం చోటు చేసుకుంది. యాత్రలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బస చేశారు. అయితే యాత్రికుల్లో ఒకరైన కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన ఏ.గోమతేశన్ (80)గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన స్థానిక రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి రూ.26వేలు వెచ్చించి ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించే ఏర్పాట్లు చేశారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య



జాదవ్ భరత్ (ఫైల్)

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంగారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని సాకెర గ్రామానికి చెందిన జాదవ్ భరత్ (50) నాలుగేళ్ల క్రితం పెద్ద కుమార్తె, రెండేళ్ల క్రితం చిన్న కుమార్తె వివాహం జరిపించాడు. పెళ్లిళ్లతో పాటు పంటల సాగుకోసం అప్పు చేశాడు. తీర్చేమార్గం కనిపించకపోవడంతో కొన్నిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తన చేనులో పురుగుల మందు తాగాడు. ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య విజయబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగారెడ్డి తెలిపారు.

'కడెం' గేటు ఎత్తివేత



కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం 3,010 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక వరద గేటు ఎత్తారు. 3,965 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.275 అడుగులు ఉంది. దీంతో వరద పెరిగే అవకాశం ఉండడంతో నీటిని దిగువకు వదులుతున్నారు.

గోదావరిలోపడి ఒకరు మృతి

బాసర: ప్రమాదవశాత్తు గోదావరిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రవీంద్రపూర్ కాలనీకి చెందిన వాడ్కే అశోక్ (46) కొంత కాలంగా మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథలో వాటర్ సప్లై హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటలకు ట్యాప్ తిప్పడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోగా గురువారం మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేతనం రాక ఆగిన ఊపిరి



ప్రభాకర్ మృతదేహం



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- గుండెపోటుతో మిషన్ భగీరథ వాటర్ మెన్ మృతి
- ఏడు నెలలుగా జీతం ఇవ్వని కాంట్రాక్టు సంస్థ
- కుటుంబ పోషణకు అప్పులు.. మానసిక ఒత్తిడి..
- మృతదేహంతో బంధువుల ఆందోళన

ముధోల్: ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మిషన్ భగీరథ వాటర్‌మెన్ మానసిక ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పందిర్ల ప్రభాకర్(38) ఫిల్టర్ బెడ్ నిర్వహణ చూసుకునే ఓ ప్రైవేటు ఏజెన్సీ తరపున వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏజెన్సీ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రభాకర్ మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. గురువారం గుండెపోటుతో మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన..

వేతనం రాకపోవడంతోనే ప్రభాకర్ గుండెపోటుకు గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని ఫిల్టర్ బెడ్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడే ఉంచి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేశారు. మిషన్ భగీరథ ఏఈఈ సుమన్, ఏజెన్సీ ప్రతినిధి అజయ్ అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సాయికిరణ్ అక్కడి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య రాజీ కుదరకపోవడంతో రాత్రి 8 గంటల వరకు మృతదేహంతో ఆందోళన కొనసాగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హైదరాబాద్‌లో భైంసా విద్యార్థి ఆత్మహత్య



చికిత్స పొందుతున్న దేవిదాస్



నవదీప్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి నవదీప్(16) హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నవదీప్ పదోతరగతి వరకు ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో చదువగా రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలోని సీఓఈ(కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో సీటు రావడంతో ఇంటర్ ఫస్టియర్‌లో చేరాడు. ఈ క్రమంలో ఇటీవల సెలవుల నిమిత్తం భైంసాలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి తిరిగి వెళ్లేందుకు హైదరాబాద్‌లోని తన సోదరుడి వద్దకు వెళ్లాడు. గురువారం ఉదయం సోదరుడి గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన భైంసాలోని విద్యార్థి తండ్రి గడపాలే దేవిదాస్ స్పృహ తప్పి పడిపోగా కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని చెప్పారు.